జనహిత యాత్రకు భారీ బందోబస్తు..

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఆధ్వర్యంలో గంగాధర మండలంలో ఆదివారం నిర్వహించిన జనహిత పాదయాత్ర సందర్భంగా జిల్లా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ జి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో 200 మంది వివిధ స్థాయిల అధికారులు, సిబ్బందిని బందోబస్తుకు ఉపయోగించారు. ఇద్దరు సీఐలు, 20 మంది ఎస్‌ఐలు, 27 మంది ఏఎస్‌ఐలు, 70 మంది కానిస్టేబుళ్ళతోపాటు మిగతా మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులు, క్యూఆర్‌టీం, రోప్‌పార్టీ సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. పాదయాత్ర మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా దారి మళ్లింపు చర్యలు చేపట్టారు.

● పిక్ పాకెటర్ల అరెస్టు...

గంగాధరలో పాదయాత్ర సందర్భంగా ఆదివారం పలువురు పిక్ పాకెటర్స్ జనాల్లో కలిసిపోగా మఫ్టీలో ఉన్న పోలీసులు వారిని ఫింగర్‌ప్రింట్ డివైస్‌తో తనిఖీ చేసి అదుపులోకి తీసుకుని గంగాధర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొందరు బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్‌లను కూడా పోలీసులు ముందస్తు చర్యగా అదుపులో తీసుకుని ఠాణాకు తరలించారు. టీపీసీసీ చీఫ్‌తోపాటు మీనాక్షి నటరాజన్, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు బసచేయనున్న ప్రాంతం (కాంగ్రెస్ కార్యకర్త ఇంటి వద్ద)లో మఫ్టీలో ప్రత్యేక పోలీసులను కాపలా పెట్టారు.

● సైడ్‌లైట్స్

- 6 గంటల 10 నిమిషాలకు ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ ఉప్పరమల్యాలకు చేరుకున్నారు.
- కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ అనంతరం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.
- 6:20 గంటలకు పాదయాత్ర ప్రారంభమయింది.
- గంగాధర మధురానగర్ చౌరస్తాకు ఎనిమిది గంటలకు పాదయాత్ర చేరింది.
- ఉప్పరమల్యాలలో జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మీనాక్షి నటరాజన్‌ను గజమాలతో సత్కరించారు.
- ఉప్పరమల్యాల నుంచి కురిక్యాల మీదుగా గంగాధర మధురానగర్ వరకు ఆరు కిలోమీటర్ల మేరకు పాదయాత్ర సాగింది.
- కురిక్యాలలో మీనాక్షి నటరాజన్‌కు మహిళలు హారతులతో స్వాగతం పలికారు.
- పాదయాత్ర సందర్భంగా కరీంనగర్-జగిత్యాల మధ్య ట్రాఫిక్‌ను దారి మళ్లించారు.
- మధురానగర్‌లో సభ 8:40కి ముగిసింది.

\- చొప్పదండి/గంగాధర,ఆంధ్రజ్యోతి



బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీ గౌస్ ఆలం

జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి

- క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- డీపీవో జగదీశ్వర్



జెండా ఊపి త్రీ కే రన్‌ను ప్రారంభిస్తున్న డీపీవో జగదీశ్వర్

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని డీపీవో జగదీశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని 3కే రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడ లను, క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 31వ తేదీ వరకు జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం స్టేడియంలో ప్రారంభమైన రన్ భగత్ నగర్, కలెక్టరేట్‌ల మీదుగా తెలంగాణ చౌక్ వరకు సాగింది. తిరిగి తెలంగాణ చౌక్ నుంచి అంబేద్కర్ స్టేడియం చేరుకుంది. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేష్ రెడ్డి, యోగా సంఘం జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి

గణేశ్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామని టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ మేక రమేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. అందుకు విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సర్కిల్‌లోని డీఈ టెక్నికల్ అధికారులను సేఫ్టీ అధికారులుగా నియమించామని తెలిపారు. రైతుల సమస్యలను విని పరిష్కరించడానికి పొలంబాట కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు 1,181 లూజ్ లైన్లు, 791 వంగిన పోల్‌లు సరిచేశామని తెలిపారు. అవసరమున్న చోట 2,090 ఏర్పాటు చేశామని చెప్పారు. 144 లోలెవెల్ లైన్ క్రాసింగ్స్, 145 డబుల్ ఫీడింగ్ పాయింట్లను మార్చామన్నారు. 429 తక్కువ ఎత్తులో ఉన్న డీటీఆర్‌ల ఎత్తు పెంచామని చెప్పారు. భద్రత సూచనల బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నిరంతర శిక్షణ, భద్రతా పద్ధతులను బలోపేతం చేయడం వల్ల భద్రతా ప్రమాణాలను పెంచగలుగుతున్నామన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణను ఒక సంకల్పంగా తీసుకొని అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తినా 1912 టోల్ ఫ్రీనంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విదేశాల్లో ఉన్నతవిద్య కోసం 'విద్యానిధి'
6



ఓట్ చోరీతోనే బండి సంజయ్ గెలుపు

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వంద సీట్లు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

ఓట్ చోరీతోనే కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్ గెలుపొందారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. గంగాధర మండలంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి జనహిత పాదయాత్ర ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధురానగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఒకే అడ్రస్‌పై వందల ఓట్లు, జీరో అడ్రస్‌లపై వేల ఓట్లు ఉన్నాయన్నారు. బండి సంజయ్ బీసీల గురించి ఏనాడైనా మాట్లాడాడా అని ప్రశ్నించారు. ఆయన బీసీల్లో ఉన్న దేశ్‌ముఖ్ అని విమర్శించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వంద సీట్లతో గెలుపొంది చొప్పదండిలోనే విజయోత్సవ సమావేశం నిర్వహిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

\- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

7

జనహిత పాదయాత్ర సక్సెస్

- అడుగడుగునా ప్రజల నీరాజనం
- కాంగ్రెస్‌లో ఉత్సాహం..


కురిక్యాలలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల ఇంట్లో టీతాగుతున్న మహేష్‌కుమార్‌గౌడ్, మీనాక్షి నటరాజన్, మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆదివారం నిర్వహించిన జనహిత పాదయాత్ర విజయవంతమైంది. మండలంలోని ఉప్పరమల్యాల నుంచి కురిక్యాల మీదుగా మధురా నగర్ వరకు 5 కిలోమీటర్ల మేర జరిగిన పాదయాత్రలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం 6.20 గంటలకు యాత్ర మండలంలోని ఉప్పరమల్యాలకు చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మీనాక్షి నటరాజన్ అనంతరం జెండా ఆవిష్కరించి యాత్ర ప్రారంభించారు. ఉప్పరమల్యాల నుంచి ఎనిమిది వేల మందితో పాదయాత్ర నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మహేష్‌కుమార్, మీనాక్షి నటరాజన్‌ను గజమాలలతో సత్కరించారు. మహిళలు హారతులు పట్టగా కోలాటాలు, వాయిద్యాల మధ్య పాదయాత్ర ఉత్సాహంగా సాగింది. ఉప్పరమల్యాలలో పాదయాత్ర చేస్తున్న వారికి ముదిరాజ్‌లు చేపల వలను అందించి సంఘీభావం తెలిపారు. ఉప్పరమల్యాల నుంచి మధురానగర్ వరకు సుమారుగా 6 కిలో మీటర్లు సాగిన యాత్ర రాత్రి 8 గంటలకు మధురానగర్‌కు చేరింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంతో రోడ్ షో అనంతరం నృత్యాలు చేశారు. వాహనంపై ఉన్న టీపీసీసీ చీఫ్, ఇన్‌చార్జి, మంత్రులు, ఎమ్మెల్యేలు అభివాదం తెలిపారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు.

● ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

పాద యాత్రలో భాగంగా కురిక్యాలలో ఇందిరమ్మ ఇంటిని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్, మీనాక్షి నటరాజన్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఇందిరమ్మ ఇంటి యజమాని బాలసాని భాగ్య

మిగతా 8వ పేజీలో

యోగా క్రీడాకారులు ప్రతిభ చూపాలి

ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జి జనార్దన్‌రెడ్డి




యోగాసన పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న అతిథులు, యోగాసనాలు వేస్తున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్ ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): యోగా క్రీడాకారులు ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎదగాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్, జూనియర్ యోగాసన పోటీల్లో ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్స్ ఆదివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు పలు అవకాశాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల రమేష్ మాట్లాడుతూ సెప్టెంబరు 5 నుంచి 7వరకు నిర్మల్‌లో జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధం కావాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిక పోటీల కన్వీనర్ ఎం రమేష్, కో కన్వీనర్ ప్రియాంక, అసోసియేషన్ బాధ్యులు గడ్డం మధు, అర్చన, అంజిబాబు, పరమేశ్వర్, సత్యనారాయణ, శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు...

సబ్ జూనియర్ బాలికల విభాగంలో రిషిక, శ్రీవిద్య, వినీత, జూనియర్ విభాగంలో ధృతి, ప్రసన్నలక్ష్మి, విశిష్టలు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ బాలుర విభాగంలో విశ్వవిషిత్, చైతన్య, జి శ్రీహర్ష, జూనియర్స్ విభాగంలో అభినయ యాదవ్, అజయ్ ఎంపికయ్యారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ర్యాగింగ్‌కు పాల్పడడం తీవ్రమైన నేరమని, ఇది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తుందని ఆయన అన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లపై చేసే వేధింపులు, అసభ్యకర కార్యకలాపాలు చట్ట ప్రకారం శిక్షార్హమని ఆయన స్పష్టం చేశారు. అటువంటి చర్యలకు పాల్పడిన వారిని విద్యా సంస్థల నుంచి తొలగించడమే కాకుండా, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, ఇది వారి ఉజ్వల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

విద్యాసంస్థల యాజమాన్యానికి సూచనలు

ర్యాగింగ్ నియంత్రణ కోసం విద్యాసంస్థల యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ప్రతి కళాశాలలో యాంటీ-ర్యాగింగ్ కమిటీలు, స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని, కొత్తగా వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్ర మాలు, సెమినార్లను నిరంతరం నిర్వహించాలని, విద్యార్థుల ఫిర్యాదుల కోసం 24 గంటల హెల్ప్‌లైన్ నెంబర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

విద్యార్థులకు..

సహ విద్యార్థులపై ఎటువంటి వేధింపులకు, అసభ్య కార్యకలాపాలకు పాల్పడవద్దని పోలీస్ కమిషనర్ విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ర్యాగింగ్‌కు గురైతే తక్షణమే ప్రిన్సిపాల్, యాజమాన్యం లేదా పోలీసులకు సమా చారం అందించాలని సూచించారు. ర్యాగింగ్‌తో విద్యార్థుల భవిష్యత్తు మాత్రమే కాకుండా సమాజంపైనా ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. ర్యాగింగ్ సమాచారం అందించడానికి డయల్ 100 లేదా పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నంబర్లు 87126 70744, 871267 0745కు కాల్ చేయవచ్చని, సమా చారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీస్ కమిషనర్ తెలిపారు. అందరి సహకారంతో ర్యాగింగ్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు.



మండుతున్న కూరగాయల ధరలు



హుజూరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో మార్కెట్లో కూరగాయల ధరలు మండుతున్నాయి. సామాన్య ప్రజలు కూరగాయలు కొనాలంటే జంకుతున్నారు. మొన్నటి వరకు తక్కువ ధర ఉన్న కూరగాయలు వర్షాల కారణంగా ఇతర ప్రాంతాల నుంచి సరఫరా అవుతుండడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయి. కిలో బోడకాకరకాయ 180, చిక్కుడుకాయ 80, కాలిఫ్లవర్ 80, మునగకాయ 80, కొత్తిమీర 100, పూదీన 100, పాలకూర 70, పచ్చిమిర్చి 60, టమాట 50, వంకాయ 50, క్యారెట్ 60, బీట్‌రూట్ 50, క్యాబేజీ 50, కాకరకాయ 60 రూపాయల ధరలు పలుకుతుండడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు.

హుజూరాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులు కూరగాయలు పండించేవారు. వారం దరూ వరి వైపు మొగ్గు చూపుతున్నారు. కొంత మంది రైతులు కూరగాయలు సాగు చేసినా ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రంగారెడ్డి, నిజామా బాద్, మెదక్, ఖమ్మంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలను తీసుకువస్తుండడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. కిలో కొనుగోలు చేసే సామాన్యుడు పావుకిలో, అరకిలో కొనుగోలు చేసి సర్దుబాటు చేసుకుంటున్నారు.



పురుగుల మందుతాగి యువకుడి బలవన్మరణం


నవీన్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామానికి చెందిన రేకుల నవీన్(43) మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నవీన్ భార్య సుజాత మద్యం తాగవద్దని ఎన్నిమార్లు చెప్పినా వినలేదు. ఈనెల 23న అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడి మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు నవీన్‌ను కాల్వశ్రీరాంపూర్ ఆసుపత్రికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైనవైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సుజాతతో పాటు ఒక కుమారుడు ఉన్నాడు. నవీన్ తల్లి సరోజ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

కమాన్‌పూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలపల్లి గ్రామానికి చెందిన గాజుల రవీందర్ గౌడ్(30) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. రవీందర్‌గౌడ్ పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. సంవత్సర కాలంగా స్వగ్రామమైన ములకలపల్లిలో జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆరు నెలలుగా భార్యభర్తల మధ్య నిత్యం గొడవలు జరుగుతున్నాయి. గొడవలతో విసిగిపోయిన రవీందర్ మనస్తాపంతో పురుగు మందు తాగాడు. దీనిని గమనించిన బంధువులు అతన్ని హుటాహుటిన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి గాజుల వెంకటస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

జ్యోతినగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్‌లో ఆదివారం రాత్రి కొంపెల్లి భీమమ్మ(65) అనే వృద్ధురాలు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పని మనిషి ఇంటికి వచ్చిన సమయంలో వృద్ధురాలు ఆత్మహత్య చేసుకొన్న విషయాన్ని గుర్తించి చుట్టుపక్కల వారికి సమాచారం అందించింది. మృతురాలి బంధువులు అందుబాటులో లేరు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఎన్టీపీసీ పోలీసులు మృతదేహాన్ని గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

యువకుడి మృతదేహం లభ్యం


రామ్‌అనుజ్(ఫైల్)

ఓదెల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శానగొండ గ్రామపంచాయతీ అనుబంధ గ్రామం గొల్లపల్లి సమీపంలోని రైల్వేపట్టాల పక్కన సిమెంట్ కాలువలో ఆదివారం యూపీ రాష్ట్రం, సుల్తానుపూర్ జిల్లాలోని సజ్వాన్ హరినాథ్ పూర్‌కు చెందిన రామ్‌అనుజ్ యాదవ్(29) అనే యువకుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. మూడురోజుల క్రితం గుర్తుతెలియని ఎక్స్‌ప్రెస్‌రైలులో హిటాచ్చి నుంచి బెంగళూర్‌వైపు ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉంటాడని జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. తీవ్రగాయాలతో మృతదేహం కుళ్లిపోయి ఉందని, మృతుడివద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా వివరాలు లభించాయని తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు, బంధువులకు సమాచారం అందజేసి మృతదేహాన్ని రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

గుండెపోటుతో న్యాయవాది మృతి

జమ్మికుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటకు చెందిన సీనియర్ న్యాయవాది శేషాల సారంగం(66) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. కాంగ్రెస్‌పార్టీ బ్లాక్‌బి అధ్యక్షుడు మొలుగూరి సదయ్య పుష్పాంజలి ఘటించి భౌతికకాయానికి కాంగ్రెస్ పార్టీ కండువా వేశారు. ఆయనవెంట మాజీ కౌన్సిలర్ శ్రీపతి నరేష్, పొనగంటి రవీందర్ ఉన్నారు.

ప్రమాదకరంగా లక్ష్మీపూర్-వెల్ది రోడ్డు


లక్ష్మీపూర్‌లో కల్వర్టుకు ఏర్పడిన గొయ్యి

మానకొండూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని లక్ష్మీపూర్-వెల్ది గ్రామాల ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టుపై గొయ్యి ఏర్పడింది. ఈ ప్రదేశంలో గ్రామస్థులు మట్టిని పోసి కర్రలను పెట్టారు. ఈ రూట్‌లో నిత్యం ఆర్టీసీ బస్సు, ఇసుక ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెలుతుంటాయి. సింగిల్ రోడ్డు కావడంతో రాత్రివేళలో ఎదురెదురుగా వచ్చే వాహనాల వెలుతురుకు గొయ్యి కనబడడం లేదని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గొయ్యిపడి సుమారు 20 రోజులు దాటినా మరమ్మతు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విదేశాల్లో ఉన్నత విద్య కోసం 'విద్యానిధి'



- ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం అంబేద్కర్ ఓవర్సీస్
- బీసీ, ఈబీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా ఓవర్సీస్ పథకం



చొప్పదండి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు విద్యానిధి ఓవర్సీస్ పథకం వరంగా నిలుస్తున్నది. విదేశాల్లో విద్య ఖర్చుతో కూడుకున్నది కాగా పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులకు అందని ద్రాక్షగా మారేది. కాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి, మహాత్మా జ్యోతిబాఫూలే ఓవర్సీస్ విద్యానిధి పథకాలు విద్యార్థులకు వరంగా మారుతున్నాయి. పేద విద్యార్థుల కలను నెరవేర్చి విదేశాల్లో విద్యను చదివేందుకు ఆలంబనగా నిలుస్తున్నాయి.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి..

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశాల్లో విద్యనందించే అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం వరంగా మారింది. రూ.20లక్షల వరకు రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లను ఎంపికైన విద్యార్థులకు అందజేస్తుంది. దీంతో పాటు విమాన ఖర్చులు, వీసా ఖర్చులను భరిస్తుంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు యూఎస్ఏ, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, సౌత్‌కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు అవకాశం కల్పిస్తున్నది. కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాల్సి ఉండగా కుటుంబంలోని ఒకే విద్యార్థికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. విద్యార్థులు గ్రాడ్యుయేషన్‌లో 60శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ విద్యార్థులు జీఆర్ఈ, జీమ్యాట్, ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ టెస్ట్‌లో అర్హత సాధించాలి. ఎస్టీ విద్యార్థులు జీఆర్ఈ, జీమ్యాట్, టోఫెల్, పీఈటీలో అర్హత సాధించాల్సి ఉంటుంది. కాగా ఈ నెల 31లోగా ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలి.

బీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబాఫూలే విద్యానిధి పథకం..

బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఉన్నత విద్యనందించేందుకు మహాత్మా జ్యోతిబాఫూలే విద్యానిధి పథకం దోహదపడుతున్నది. ఈ పథకం కింద కూడా రూ.20 లక్షల వరకు స్కాలర్‌షిప్ అందజేస్తారు. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షలలోపు ఉండాలి. గ్రాడ్యుయేషన్‌లో 60శాతం మార్కులు సాధించి ఉండడంతోపాటు జీఆర్ఈ, జీమ్యాట్, టోఫెల్, ఐఇఎల్‌టీఎస్, పీటీఈలో అర్హత మార్కులకు ఆధారంగా ఎంపిక చేస్తారు. యూఎస్ఏ, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు అవకాశం కల్పిస్తున్నది. ఈ పథకానికి కూడా ఈనెల 31లోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

అన్నారం టు జగిత్యాల.. కలప అక్రమ రవాణా


అన్నారంలోని ఆలేటి చెరువు కట్టపై నిల్వ ఉంచిన కర్రలు

మానకొండూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామం నుంచి జగిత్యాల జిల్లాకు అక్రమ కలప రవాణా కొనసాగుతోంది. అన్నారం గ్రామంలోని మామిడితోటలు, తుమ్మ, వేపచెట్లను నరికివేస్తూ కలపను కరీంనగర్- జగిత్యాల జిల్లాలకు అక్రమంగా తరలిస్తున్నారు. అన్నారం ఆలేటి చెరువు కట్టపై కర్రలను నిల్వ చేసి లారీలు, వ్యానులలో కర్రలను పేర్చి అవి కనబడకుండా టాటిపత్రితో కట్టి రాత్రి వేళల్లో రవాణా చేస్తున్నారు. కలప అక్రమ రవాణా జరుగుతున్నా అటవీశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా మండలంలోని పచ్చునూర్, కెల్లేడు, రంగపేట, లక్ష్మీపూర్, వెల్ది, వేగురుపల్లి, రంగపేట, ఊటూర్, దేవంపల్లి, చెంజర్ల తదితర గ్రామాల్లో చెట్లను నరికివేస్తున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రతిరోజు పర్యవేక్షించి చెట్ల నరికివేతను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సందడే.. సందడి..

- ఎగువ మానేరుకు భారీగా సందర్శకులు


ఎగువ మానేరు జలాశయం వద్ద భారీగా సందర్శకులు

గంభీరావుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఆదివారం కావడంతో సందర్శకుల తాకిడి భారీగా కన్పించింది. మానేరు మత్తడి దూకడం తగ్గుముఖం పట్టినా ప్రాజెక్టు అందాలను చూసేందుకు పర్యాటకులు వస్తున్నారు. మానేరు మత్తడి దూకే ప్రాంతం సందర్శకులతో సందడి సందడిగా మారింది.

చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో కొండచిలువ


కొండచిలువతో అసిరి సుమన్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని డీర్‌పార్క్ పక్కన ఉన్న చేపపిల్లల ఉత్పత్తికేంద్రం వద్ద ఆదివారం ఓ కొండచిలువ చేపలవలలో చిక్కుకొని కనిపించింది. దీంతో గమనించిన సిబ్బంది జంతుసంరక్షణశాలకు సమాచారం అందించారు. జంతుసంరక్షణశాల అధ్యక్షుడు అసిరి సుమన్ పటేల్ కొండచిలువను బయటకు తీసి అటవీప్రాంతంలో వదిలిపెట్టారు.

మారమ్మ తల్లికి మొక్కులు


దప్పువాయిధ్యాలతో వెళ్తున్న గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్, వేములకుర్తి గ్రామాల అభివృద్ధి కమిటీలు, కుల సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మారమ్మతల్లి, గ్రామ దేవతలకు మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన రహదారుల్లో అమ్మవారికి బోనం, చీరె, సార తదితర వస్త్రాలు, పూజసామగ్రిని ఎదుర్కొంటు వెళ్లారు. పలుచోట్ల పోత రాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పంటలు సమృద్ధిగా పండాలని, సీజన్లో వచ్చే అనారోగ్య సమస్యల నుంచి పిల్లాపాపలను చల్లగా చూడాలని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో పడిన రెండేళ్ల బాలుడు

- గాలిస్తున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది


కౌశిక్ నంద(ఫైల్)

సైదాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన చేరాల వెంకటయ్య-కావ్యల రెండేళ్ల కొడుకు ఆడు కుంటూ వెళ్లి వ్యవసాయ బావిలో పడిపోయాడు. వివరాల్లోకి వెళితే.. కావ్య కొడుకును తీసుకొని మధ్యాహ్నం సమయంలో వారి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లింది. బాలుడిని ఒడ్డుపై ఉంచి వ్యవసాయ పనుల్లో నిమగ్నమైంది. ఇంతలో బాలుడు ఆడుకుంటూ వెళ్లి బావిలో పడిపోయాడు. బావిలో ఏదో పడిన శబ్దం విన్న కావ్య తలెత్తి చూసింది. ఒడ్డుపైన ఆడుకుంటున్న బాలుడు కనిపించలేదు. దీంతో కావ్య లబోదిబోమంటూ బాలుడి కోసం చూసింది. ఎక్కడా కనిపించకపోయే సరికి బాబే బావిలో పడ్డాడని భావించి చుట్టపక్కల వారిని పిలిచింది. అక్కడికి చేరుకున్న సమీప పొలాల రైతులు, కూలీలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనస్థలానికి చేరుకొని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు బాలుడి మృతదేహం వెలికితీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బావిలో నీరు ఎక్కువగా ఉండడం, బావి చుట్టూ పొదలు అల్లుకపోయి ఉండడంతో బాలుడి మృతదేహం వెలికితీతకు ఆలస్యం అవుతోందని పోలీసులు పేర్కొన్నారు. బావికి మోటార్లు పెట్టి నీటిని తోడుతున్నారు. రాత్రి వరకు బాలుడి మృతదేహం లభ్యం కాలేదు.

డాక్యుమెంటేషన్ వెరిఫికేషన్ పేరిట రూ.1.48లక్షల స్వాహా

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డాక్యుమెంటేషన్ వెరిఫికేషన్ పేరిట సైబర్ నేరగాళ్లు ఓవిద్యార్థి నుంచి రూ.1.48 లక్షలు స్వాహా చేశారు. కరీంనగర్ త్రీ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ వావిలాలపల్లికి చెందిన బి శ్రీపీతం అనేవిద్యార్థి పైచదువుల కోసం వీసాకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈనెల 8న ఇండియన్ ఎంబసీ పేరుతో శ్రీపీతంకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేశాడు. డాక్యుమెంటేషన్ వెరిఫికేషన్ జరుగుతోందని, ఫీజు చెల్లించాలని పేర్కొన్నాడు. నాలుగు దఫాలుగా ఫోన్‌పే ద్వారా మొత్తం రూ.1,48,200 పంపించాడు. ఆ తరువాత గుర్తుతెలియని వ్యక్తికి ఫోన్‌చేయగా స్విఛాఫ్ వచ్చింది. సైబర్ నేరగాళ్ల పనేనని గ్రహించి వెంటనే 1930 నంబరులో ఫిర్యాదు చేశాడు. దీనిపై కరీంనగర్ త్రీ టౌన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

డీఎల్‌ఎడ్‌లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

తిమ్మాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డీఎల్‌ఎడ్ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు మరోసారి స్పాట్ అడ్మిషన్లకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మండలంలోని ఎల్ఎండీలో గల డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డీసెట్ 2025ఉత్తీర్ణులై అర్హత, ఆసక్తి ఉండి ఇప్పటి వరకు ప్రవేశంపొందని అభ్యర్థులు డీసెట్2025 వెబ్‌సైట్‌ను పరిశీలించి తమ మాధ్యమంలో తమతమ కేటగిరి సీట్లుఖాళీగా ఉన్న కళాశాలలను తెలుసుకోవాలని అన్నారు. అన్నిఒరిజినల్ సర్టిఫికేట్లు తీసుకొని ఈనెల 26న ఉదయం 10గంటలకు ఎల్ఎండీ కాలనీలో గల ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థకురావాలని, 28న ప్రైవేటు కళాశాలకు ఉదయం 10గంటలకు వెళ్లి సీటు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని రక్షించిన లేక్ పోలీసులు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన వ్యక్తిని శనివారం అర్ధరాత్రి సమయంలో లేక్‌పోలీసులు కాపాడారు. లేక్ పోలీసుల వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా కోహెడ మండలం ఎన్టీఆర్ కాలనీకి చెందిన వేల్పుల సంపత్(39) ప్రస్తుతం కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌లో నివాసం ఉంటున్నాడు. కుటుంబసభ్యుల సమస్యలతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకునేందుకు మానేరుజలాశయం కట్టపైకి ఎక్కాడు. అక్కడ విధుల్లో ఉన్న లేక్ అవుట్‌పోస్ట్ హోంగార్డు శ్రీనివాస్ గమనించి అడ్డుకున్నాడు. అనంతరం సంపత్‌కు లేక్ అవుట్ పోస్ట్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. కుటుంబసభ్యులను పిలిపించిన అప్పగించారు. సమయానికి స్పందించి సంపత్ ప్రాణాలు కాపాడిన హోంగార్డు శ్రీనివాస్‌ను పోలీస్‌కమిషనర్ గౌస్‌ఆలం అభినందించారు.

రెండు ఇళ్లలో చోరీ

తిమ్మాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి గ్రామంలో తాళాలు వేసిఉన్న కరివేద కరుణాకర్‌రెడ్డి, లెంకల రామచంద్ర రెడ్డి ఇళ్లలో ఈనెల23 అర్ధరాత్రి దొంగలు పడ్డారు. రూ.5వేలు, 15తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఎస్సారెస్పీకి తగ్గిన ఇన్‌ఫ్లో

- ఎనిమిది గేట్లు తెరిచి.. 24,640 క్యూసెక్కులు దిగువకు
- కాకతీయ కాలువ, వరద కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల


దిగువకు విడుదలవుతున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఆదివారం ఇన్‌ఫ్లో తగ్గింది. ఎస్సారెస్పీ వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల ఆదివారం కొనసాగింది. ఎనిమిది గేట్ల ద్వారా 24,640 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. కాగా ఎస్సారెస్పీలోకి 54,187 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటినిల్వ 80.5సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరదగేట్లు పైకి ఎత్తడం, కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 54,187క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరదకాలువకు 20,000క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 3,500క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 500క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నందున నదీ పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా రైతులు, చేపలు పట్టేవారు, పశువుల కాపరులు నదిలోకి దిగవద్దని అధికారులు కోరుతున్నారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు..

ధర్మారం: గోదావరి జలాల ఎత్తిపోతలు 12రోజులుగా కొనసాగుతున్నాయి. ఈనెల 13 నుంచి మూడు పంపుల ద్వారా ఎత్తిపోతలు ప్రారంభించారు. అప్పటి నుంచి నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఒక్కో రోజు రెండు, మూడు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. ఉదయం 7.30 నుంచి సాయంత్రం 5-30గంటల వరకు మొదట మోటార్లను రన్‌చేశారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి భారీగా వరద నీరు ఎల్లపల్లి ప్రాజెక్టుకు వస్తుండడంతో నిర్విరామంగా ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం రెండుమోటార్ల ద్వారా 6300క్యూసెక్కుల నీటిని ఎగువకు ఎత్తిపోయగా, ఆదివారం ఒక మోటారు ద్వారా 3150క్యూసెక్కుల నీటిని లక్ష్మీ పూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌కు తరలిస్తు న్నారు.


గాయత్రి పంపుహౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

ఎల్లంపల్లి నుంచి నీటి విడుదల..

పెద్దపల్లి: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 89,138క్యూసెక్కుల వరదనీరు వస్తున్నది. 10 గేట్ల ద్వారా 70,248క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. అలాగే నంది పంపు హౌస్‌కు 3150క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా, అక్కడినుంచి గాయత్రి పంప్ హౌస్ మీదుగా అంతేమొత్తంలో నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకుగాను, 19.925టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

సుందిళ్ల బ్యారేజీలో పెరిగిన గోదావరి వరద..

మంథని రూరల్: మండలంలోని సిరిపురం వద్ద ఉన్న సుందిళ్ల బ్యారేజీలో ఆదివారం గోదావరి వరద పెరిగింది. ఎగువ ప్రాంతం నుంచి గోదావరిలోకి 73,994 క్యూసెకుల వరద నీరు బ్యారేజీ లోకి వస్తుండటంతో అధికారులు వరద నీటిని దిగువ ప్రాంతానికి వదులుతున్నారు. రెండు రోజుల క్రితం వర్షాలు తగ్గడంతో వరద నీరు తగ్గింది.

గాయత్రి నుంచి కొనసాగుతున్న నీటివిడుదల..

రామడుగు: రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి నీటివిడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం ఒక్క పంపు ద్వారా 3150క్యూసెక్కుల నీటిని అధికారులు గ్రావిటీ కెనాల్‌కు విడుదల చేశారు. అదినేరుగా వెళ్లి వరదకాలువలో కలుస్తోంది. ఎస్సారెస్పీ నుంచి 18,500క్యూసెక్కుల నీరు వరదకాలువలో 99వ కిలోమీటర్ల వద్ద కలుస్తోంది. దీంతో ప్రస్తుతం 21,650క్యూసెక్కుల నీరు చేరుతున్నది. అయితే మిడ్ మానేరుకు 21,650 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. వరదకాలువ నిండుకుండలా తయారై కొత్త ఒరవడిని సృష్టిస్తోంది.

అన్నపూర్ణలోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు..

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటిఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5టీఎంసీ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.45 టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా 9600 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఎగువన ఉన్న 11వ ప్యాకేజీలోని రంగనాయకసాగర్‌కు 9900క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం మూడు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ద్వారా నీటిప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రంవరకు 18,218క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగు తోంది. ఇందులో ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 15,068, గాయత్రి పంప్ హౌస్ నుంచి 31,150 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. కాగా మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి ప్యాకేజి 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 9600, ఎల్ఎండీ ప్రాజెక్టుకు ఆరు గేట్లను ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 313.77, నీటి నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 17.897 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

9 టీఎంసీలకు చేరిన ఎల్ఎండీ రిజర్వాయర్

తిమ్మాపూర్: ఎగువ నుంచి, శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్(ఎంఎంఆర్) నుంచి వస్తున్న నీటి ఇన్‌ఫ్లోతో దిగువమానేరు జలాశయం 9.07 టీఎంసీలకు చేరింది. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.977 టీఎంసీలు ఉంది. ఎంఎంఆర్ నుంచి 9489 క్యూసెక్కులు నీరు ఇన్‌ఫ్లో ఎల్ఎండీలోకి వస్తుండటంతో 229క్యూసెక్కుల నీరు మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో వెళుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

ఓట్ చోరీతోనే బండి సంజయ్ గెలుపు


భారీ సంఖ్యలో పాల్గొన్న ప్రజలు

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వంద సీట్లు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

కరీంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓట్‌చోరీతోనే కరీంనగర్‌లో బండి సంజయ్‌కుమార్ గెలుపొందాడని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. ఆదివారం గంగాధర మండలంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి జనహిత పాదయాత్ర నిర్వహించారు. అనంతరం మధురానగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు దొంగోట్లతోనే గెలిచారన్న అనుమానాలు ఉన్నాయన్నారు. రాహుల్‌గాంధీ బయటపెట్టిన ఓటర్ జాబితా చూస్తే స్పష్టమవుతుందన్నారు. లక్షలకు పైగాదొంగ ఓట్లు చేర్చడం, ఒకే అడ్రస్‌పై వందల ఓట్లు, జీరో అడ్రస్‌లపై వేల ఓట్లు ఉన్నాయన్నారు. ఒకే ఎపిక్ నంబర్ పై వేర్వేరు రాష్ట్రాల్లో ఓట్లు ఉండటం ప్రజాస్వామ్యా నికి ప్రమాద మన్నారు.

ఎన్నికలు వస్తేనే బీజేపీకి దేవుళ్లు గుర్తుకువస్తారు..

ఎన్నికలు వస్తే బీజేపీకి దేవుళ్లు గుర్తుకు వస్తారని, దేవుళ్లను రాజకీయాల్లోకి లాగడం ఏంటన్నారు. రాముడి అక్షంతలను సైతం రాజకీయాలకు వాడుకుంటున్నారన్నారు. దేవుళ్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ ఏనాడైనా ఓట్లు అడిగిందా అని ప్రశ్నించారు. కులం మతం లేక పోతే బీజేపీ గెలవలేదన్నారు. దేవుడి పేరుతో ఓట్లు అడిగే బిచ్చగాళ్లని, కొండగట్టు అంజన్న పేరుతో బీజేపీ నేతలు ఓట్లు అడుగుతున్నారన్నారు. ఎన్నికలు వస్తే వారికి హిందూ, ముస్లింల కొట్లాట గుర్తుకు వస్తుందని అన్నారు. బండి సంజయ్ బీసీల గురించి ఏనాడైనా మాట్లాడావా అని ప్రశ్నించారు.

బీసీల గురించి రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లతో బిల్లును రూపొందించి ఢిల్లీకి పంపిస్తే ఆమోదించడం లేదని విమర్శించారు. బండి సంజయ్ నిజమైన బీసీ నాయకుడు కాదని, బీసీల బిల్లుపై మాట్లాడకుండా ఢిల్లీలో కిషన్‌రెడ్డి అడుగులకు మడుగులు ఒత్తుతున్నాడన్నారు. బండి సంజయ్ బీసీల్లో ఉన్న దేశ్‌ముఖ్ అని విమర్శించారు. బండి సంజయ్ భవిష్యత్ బీసీ తరాలకు ద్రోహం చేస్తున్నాడ న్నారు. అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ పార్టీ ఏనాడూ పేదల గురించి ఆలోచించలేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇప్పటికే మూడు ముక్కలైందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల నాటికి పూర్తిగా కనుమ రుగవుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వంద సీట్లతో గెలు పొంది చొప్పదండిలోనే విజయోత్సవ సమావేశం నిర్వహి స్తామన్నారు.


కురిక్యాల నుంచి పాదయాత్రగా బయల్దేరి కార్యకర్తలకు అభివాదం చేస్తున్న పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం, అడ్లూరి, వివేక్


◄ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మీనాక్షి నటరాజన్

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నట రాజన్ మాట్లాడుతూ పేదల కష్టాలు తెలుసుకోవడానికే పాదయాత్ర చేస్తున్నామన్నారు. పేదల కళ్లలో ఆనందం చూడడమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. కాంగ్రెస్ నేత వెంకటస్వామి సేవలను గుర్తు చేస్తూ తెలంగాణలో ఆయన పేరుతో తెలియని వారు లేరన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, శాసన సభ్యుడు మేడిపల్లి సత్యం, మక్కాన్‌సింగ్, ప్రభుత్ విప్ ఆదిశ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు హర్కార్ వేణుగోపాల్‌రావు, మాజీ ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, భానుప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రాంమ్మోహన్, రుద్ర సంతోష్, అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కురిక్యాల నుంచి మధురానగర్ జనహిత పాదయాత్రలో భారీ సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

చివరి రక్తం బొట్టు వరకు సేవ చేస్తా

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



గంగాధర: తన చివరి రక్తంబొట్టు వరకు చొప్పదండి నియోజకవర్గానికి సేవ చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. జనహిత పాదయాత్రలో భాగంగా గంగాధర మండలం మధురానగర్‌లో ఏర్పాటు చేసిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల అధికారంలో దోచుకు న్నదని విమర్శించారు. ఒక్క ఎకరానికైనా కొత్తగా బీఆర్‌ఎస్ వాళ్లు నీళ్లు ఇవ్వలేదని, ఒకవేళ ఇచ్చి ఉంటే నేలకు ముక్కు రాస్తానని అన్నారు. నారాయణపూర్ ఎత్తు పెంచి సాగు ఆయకట్టు పెంచతామని, కొండగట్టు ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశంలో మరెక్కడా లేవు: మాజీ మంత్రి టి జీవన్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశంలో మరెక్కడా లేవని మాజీ మంత్రి టి జీవన్‌రెడ్డి అన్నారు. పేదవాడికి పట్టెడు అన్నం పెట్టాలని సన్నబియ్యం ఇస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం దశాబ్దకాలంలో పేదలకు ఒక్క ఇల్లు అయినా కట్టారా అని ప్రశ్నించారు. గృహ నిర్మాణ శాఖ పూర్తిగా నిర్వీర్యం అయిందన్నారు. భారత్ జోడో యాత్ర చేపట్టి రాహుల్‌గాంధీ రెండు రాష్ట్రాల్లో పార్టీని అధికారంలోకి తెచ్చారని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామన్నారు.

బీసీ రిజర్వేన్లు ఇచ్చి తీరుతాం

రాజ్యసభ మాజీ ఎంపీ వి హన్మంతరావు



బీసీ రిజర్వేషన్ల ఇచ్చి తీరుతామని రాజ్యసభ మాజీ ఎంపీ వి హన్మంతరావు అన్నారు. తనకన్నా పెద్ద రామభక్తుడు ఎవ్వరని ప్రశ్నించారు. దేవుళ్ల పేరిట బీజేపీ నాయకులు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

ఫార్మసీ ఆఫీసర్ల మెరిట్ లిస్టు ప్రకటించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్

సుభాష్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వైద్య.ఆరోగ్యశాఖలో మెడికల్ అండ్ హెల్త్‌సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డుద్వారా పరీక్షలు రాసిన ఫార్మసీ ఆఫీసర్స్‌కు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్‌లిస్టు ప్రకటించి నియామక ఉత్తర్వులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ కోరారు. ఆదివారం కరీంనగర్ వైద్య. ఆరోగ్యశాఖ అధికారి కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఫార్మసిస్టుల 50ఏళ్ల చిరకాల స్వప్నం ఫార్మసీ ఆఫీసర్‌కల నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఫార్మసీఆఫీసర్లకు ప్రొవిజనల్ మెరిట్‌లిస్టు ప్రకటించడంలో జాప్యం తగదని, కోర్టు కేసుతో సంబంధం లేకుండా వెంటనే ఫలితాలు ప్రకటించాలని కోరారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రితోపాటు ప్రిన్సిపల్‌సెక్రెటరీ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 104సర్వీస్‌లో పనిచేస్తున్న ఫార్మసీ ఆఫీసర్స్‌కు ఐదునెలలుగా కంటిన్యూయేషన్ లేక జీతాలు నిలిపివేశారని, ఈ విషయంపై హెల్త్ కమిషనర్‌తో చర్చించి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. బీఆర్‌ఎస్‌కేలో పనిచేస్తున్న ఫార్మసీ ఆఫీసర్లకు కూడా ప్రతీనెల జీతాలు సక్రమంగా రావడానికి కృషిచేస్తానన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్‌బాబు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి సురేష్ కళ్యాణ్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటుచేసిన జిల్లాల్లో జిల్లాఫార్మసీ ఆఫీసర్ల నియామకం, డీపీఎస్‌లలో కూడా ఫార్మసీ ఆఫీసర్ల పోస్టులు ఉండేలా ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, వివిధ ఏజెన్సీల ద్వారా పనిచేస్తున్న ఫార్మసీ ఆఫీసర్లందరికి సమాన పనికి సమాన వేతనం అందేలా కృషి చేస్తానన్నారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పి రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉదయ్ ప్రసాద్, పంద్రాల శంకర్, విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర సలహాదారు అహ్మదుల్లా ఖాన్ మాట్లాడుతూ ఇన్‌ఫార్మసీ ఆఫీసర్లకు విద్యార్హతల ఆధారంగా డైటీషియన్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, డ్రగ్ అనాలసిస్టు పోస్టులలో ప్రాధాన్యం కల్పించాలన్నారు. ఉమ్మడిజిల్లా గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వెలుతురు రవీందర్, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, కరీంనగర్ కార్యదర్శి సుధాకిరణ్, అసోసియేట్ ప్రెసిడెంట్ రాజమల్లు, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎండీ జంషీద్‌అలీ, కార్యదర్శి ఎండీ షౌకత్‌అలీ, రాజన్న సిరిసిల్ల జిల్లాఅధ్యక్షుడు సతీష్, కార్యదర్శి రాజ్‌కుమార్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు వగ సుధాకర్‌రెడ్డి, వరంగల్ జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్, అసోసియేట్ ప్రెసిడెంట్ అవినాష్, హన్మకొండ జిల్లా ఉపాధ్యక్షుడు రాకేష్, మురళీధర్ రెడ్డి, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లికి ప్రముఖుల పరామర్శ


పరామర్శిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

కరీంనగర్ అర్బన్/మానకొండూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీఅధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పరామర్శించారు. ఎమ్మెల్యే సోదరుడు రాజేశం ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆదివారం గంగాధర మండలంలో ఆదివారం జనహిత పాదయాత్ర కార్యక్రమానికి వెళ్తుండగా మార్గమధ్యలో కరీంనగర్ వాల్మీకి నగర్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కాల్ వేణుగోపాల్‌రావు, గనులు, భూగర్భశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ భానుప్రసాద్, టీపీసీసీ అధికారప్రతినిధి మేన్నేని రోహిత్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్ కుమార్, బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ ఉన్నారు.

- ఆదివారం ఉదయం ఎమ్మెల్యే కవ్వంపల్లిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, నల్గొండ జిల్లా ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, జిల్లా సహకారబ్యాంక్ అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావు, టీపీసీసీ ప్రధానకార్యదర్శి గజ్జెల కాంతం, మాజీ సుడా డైరెక్టర్ కామారపు శ్యాం పరామర్శించారు. కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎర్ర శ్రీనివాస్, మాజీ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, నాయకులు ఉన్నారు.

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మణికంఠరెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నగరానికి చెందిన కసిరెడ్డి మణికంఠ రెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సీపీఐ నాలుగో రాష్ట్ర మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మణికంటరెడ్డి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన తనఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.


మణికంటరెడ్డి

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

- కిటకిటలాడిన ఆలయాలు


నృసింహుడి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఆదివారం సెలవుదినం కావడంతో భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు నరసింహ, గోవింద నామ స్మరణలతో ప్రతి ధ్వనించాయి. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కురవీందర్, అర్చకులు, సిబ్బంది భక్తులకుసేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయసూప రింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, అలువాల శ్రీనివాస్ తదితరులున్నారు.

ఘనంగా గోపాల కాల్వలు..


ధర్మపురి క్షేత్రంలో ఆర్యవైశ్య మహిళల కోలాట నృత్యం

శ్రావణమాసం ముగింపు సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో గోపాలకాల్వలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. లోక క్షేమార్థం ఏటా నిర్వహించే విధంగా ఉదయం దివంగత ప్రముఖ వ్యాపారి చాడ గంగన్న కుటుంబసభ్యులు స్థానిక లక్ష్మీనరసింహ స్వామి, రామలింగేశ్వరస్వామి వారలకు అభిషేకాలు, ప్రత్యేకపూజలు చేయించారు. అనంతరం ఉగ్రనారసింహుని ఆలయంలో రాజరాజేశ్వరీ భజనమండలి సభ్యులు, ఆర్యవైశ్యులు, భక్తులు భజన చేశారు. అనంతరం ఆర్యవైశ్యులు, భక్తులు భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ గోదావరి నది వరకు ఊరేగింపు జరిపారు. దారిపొడవునా చిన్నారులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, చాడ కుటుంబ సభ్యులు చాడ శ్రీనివాస్, వెంకటరమణ, శ్రీనాథ్, ధర్మపురి పీఏసీఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఆర్యవైశ్య వర్తక సంఘాల మండల, పట్టణ శాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతకు కేంద్రం కారణం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

జమ్మికుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే కారణమని సీపీఎం జిల్లాకార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం జమ్మికుంటలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ఇవ్వాల్సిన కోటాలో కోతపెట్టడం వల్లే యూరియా కొరత ఏర్పడిందన్నారు. ఈ విషయంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడిపెంచి రాష్ట్రానికి రావాల్సినకోటాను తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శీలం అశోక్, బాసర సంపత్‌రావు, జక్కుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వర ఆలయంలో పనులు వేగంగా పూర్తి చేయాలి

- భక్తులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా చేపట్టాలి
- సమీక్ష సమావేశంలో అధికారులతో విప్ ఆది శ్రీనివాస్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయ మొదటిదశ అభివృద్ధి పనుల్లో భాగంగా భక్తులకు భీమేశ్వర ఆలయంలో దర్శనాలు కల్పించేందుకు జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా, ఎస్పీ మహేష్ బీ గితే, ఈవో రాధాబాయితో పాటు వివిధశాఖల అధికారులతో ఆదివారం ఆలయ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ముందుగా రాజన్న ఆలయానికి వచ్చిన వీరికి ఆలయఅర్చకులు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేకపూజలో పాల్గొన్న అనంతరం అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భీమేశ్వర ఆలయంలో కల్యాణ మండపం, హోమం, వ్రతమండపం, షెడ్ నిర్మాణం, క్యూలైన్లు, సీసీఫ్లోరింగ్ పనులు చేపడుతామన్నారు. భక్తులకు దర్శనం కోసం చేస్తున్న పనులపై ఆరాతీశారు. సమ్మక్క-సారక్కజాతర వస్తున్ననేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు.

ముగిసిన యూత్ కాంగ్రెస్ నిరాహార దీక్ష



నిరాహార దీక్షలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు వి హనుమంతరావు

గణేశ్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర సెక్రెటరీ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జ్ఞాన్‌ప్రతిష్ట కరీంనగర్‌జిల్లా అధ్యక్షుడు వుమ్మెంతుల శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో గీతాభవన్ చౌరస్తా వద్ద ఓట్ చోర్ మోడీ హటావో దేశ్‌కి బచావో అనే నినాదంతో చేపట్టిన రిలేనిరాహార దీక్ష ఆదివారం ముగిసింది. సీనియర్ నాయకులు వి.హన్మంతరావు, సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మైనారిటీసెల్ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ రెడ్డి, పొన్నం మధు మాట్లాడుతూ దేశంలో విచ్చలవిడిగా బీజేపీ పెద్దలు ఓట్లను దొంగిలిస్తున్నారని ఆరోపించారు. వీటిపై ఆధారాలతో సహా కాంగ్రెస్ అగ్రనేత బట్టబయలు చేసినా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఓట్ల చోరీపై తక్షణమే ఎలక్షన్ కమిషన్ స్పందించాలని,ఓట్లజాబితాను తొలగించాలని డిమాండ్ చేశారు. యూత్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బోయిన కృష్ణబాబు, కిమ్‌ఫహద్, సయ్యద్ సజాద్, తాళ్లపల్లి శ్రీకాంత్, అజీమ్, ఎల్కపెళ్లి సిద్ధార్థ, పురుషోత్తం, వడ్డేపల్లి విష్ణువర్ధన్, ఉమ్మెత్తుల ఆశీష్‌రెడ్డి, దూడ శ్రీకాంత్, మాట్ల రాజేష్, శనిగరపు దినేష్, వినీత్, సూరంసాయి,మహిళా నాయకురాలు రాజేశ్వరి అనూష పాల్గొన్నారు.

మొక్కజొన్న రక్షణకు..రైతుల పాట్లు

- నష్టపరుస్తున్న కోతులు, రామచిలుకలు
- మండలంలో 8,600 ఎకరాల్లో మొక్కజొన్న సాగు


మైకుతో కాపలా కాస్తున్న రైతు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నో కష్టాలకు ఓర్చి ఆరుగాలం కష్టపడి పంటను పండిస్తే పంటలు చేతికి వచ్చే దశలో కోతులు, రామ చిలు కలు రైతులకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మొక్క జొన్న పంట దశలో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. కోతులు, అడవిపందులు, రామ చిలుకల బారినుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొందరు రైతులు పంట చుట్టూ చీరలు కట్టి రక్షించుకుంటే మరికొంతమంది రైతులు చుట్టూ జాలీలు ఏర్పాటు చేస్తున్నారు. మొక్కజొన్న పంటలో మైకులను అమర్చి కొందరు రైతులు పంటను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు.

ఇబ్రహీంపట్నం మండ లంలో సుమారుగా 8,600 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. పంట 100 నుంచి 120 రోజుల్లో కోతకు వస్తుంది. విత్తనం నాటిన నుంచి సుమారుగా 70 రోజుల్లో మొక్కజొన్న కంకులు వస్తా యి. అక్కడి నుంచి సుమారుగా నెల రోజుల పాటు మొక్కజొన్నను కాపాడుకునేందుకు రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు కాపలా ఉండాల్సి వస్తోంది. పంట నాటిన నుంచి ఏదో ఒక రకంగా రైతులు ఇబ్బందులకు గురవుతూనే ఉంటారు. కొన్ని రోజులు వర్షాభావ పరిస్థితులతో, యూరియా కొరతతో కొన్ని రోజులు, భారీ వర్షాలతో మరి కొన్ని రోజులు ఇలా పంట చేతి కొచ్చే వరకు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.


కంకులను నాశనం చేసిన చిలుకలు


మొక్కజొన్న పంటకు చీరలతో రక్షణ

ఆర్చరీ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న చికిత

ఎలిగేడు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి శ్రీలత శ్రీనివాస్‌రావు కూతురు తానిపర్తి చికిత కెనడాలో జరిగిన ప్రపంచ ఆర్చరీ అండర్21 చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నది. ఆర్చరీలో శిక్షణ పొందిన ఆమె స్పోర్ట్స్ అథారిటీ తరపున కెనడాలో జరుగుతున్న పోటీలో పాల్గొంది. శనివారం చాంపియన్‌షిప్ సాధించింది. మాజీసర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, మాజీఎంపీపీ తానిపర్తిస్రవంతి మోహన్ రావు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



మెడల్స్‌తో చికిత

కాంగ్రెస్ నేతలకు ఘన స్వాగతం

కరీంనగర్ క్రైం/ భగత్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని వెలిచాల ప్రజా కార్యాలయం వద్ద కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం వాహనాల్లో ర్యాలీగా జనహిత పాదయాత్రకు తరలి వెళ్లారు. కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ చౌరస్తా వద్ద సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి స్వాగతం పలికారు. టీపీసీసీ ప్రధానకార్యదర్శి కాశిపాక రాజేశ్, కాంగ్రెస్ నాయకులు ఎండీ తాజొద్దీన్, కొరివి అరుణ్‌కుమార్ ఉన్నారు.

తిమ్మాపూర్: అలుగునూర్ కూడలిలో కాంగ్రెస్ శ్రేణులను గమనించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ తన వాహనాన్ని ఆపారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి మహేష్‌కుమార్‌గౌడ్ అలుగునూర్ కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.




అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మహేష్ కుమార్‌గౌడ్, స్వాగతం పలుకుతున్న నరేందర్‌రెడ్డి

● న్యూస్‌బాక్స్

యజ్ఞవరాహక్షేత్రంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక యజ్ఞవరాహక్షేత్రంలో ఈ నెల 27 నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలునిర్వహించనున్నట్లు ఎస్‌వీఎస్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 9 రోజులు స్వామివారికి విశేష పూజలు, సెప్టెంబరు 3న ఉదయం 9 గంటలకు గణపతి హవనం ఉంటాయని పేర్కొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవి శాత వాహన క్లబ్ అధ్యక్షుడు ఎలగందుల మునీందర్, గవర్నర్ ఇల్లందుల కిషోర్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సిరి అనే విద్యార్థికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జోన్ ఛైర్మన్ పోకల లక్ష్మీ నారాయణ, క్లబ్ కోశాధికారి తొడుపునూరి విశ్వనాథం, సెక్రెటరీ వొల్లాల సత్య నారాయణ, వైస్ ప్రెసిడెంట్ బండ సాగర్, మంచాల కిషన్, పైడ మారుతి, తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

సుభాష్‌నగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అలయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అంత ర్జాతీయ డైరెక్టర్ కోల అన్నారెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం నగరంలోని వాసుదేవ ఆసుపత్రిలో అల్పాహార వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఈద కుమారస్వామి, ఎస్ఎల్‌వీ ప్రసాద్, సోమారపు వెంక టేశ్వర్లు, కె.వెంకటేశ్వరరావు, పండగ నాగ రాజు, కొడిమ్యాల రాకేశ్, గాలపెల్లి శ్రీని వాస్, విద్యాసాగర్‌రెడ్డి, అల్లాడి ఆనంద్ కుమార్, పుల్లాల శ్యామ్, రేణుక, నాజియా, వసంత తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

జమ్మికుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పద్మశాలివాడకు చెందిన పాల స్రవంతి అనే యువతి బ్రెయిన్ ట్యూమర్‌తో మృతిచెందింది. కాంగ్రెస్ నాయకుడు సాయిని రవి తనవంతుగా ఆ కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు.

పాదయాత్రకు తరలిన నాయకులు

రామడుగు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో చేపడుతున్న పాదయాత్రకు కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు.

సమస్యల పరిష్కారానికి కృషి



రోడ్డును పరిశీలిస్తున్న వెలిచాల రాజేందర్

కరీంనగర్ రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. ఆదివారం తీగలగుట్టపల్లిలో మార్నింగ్ వాక్ పేరిట నేనున్నా మీకోసం అనే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఇందులో భాగంగా నగునూర్ శివారులో దుర్గ మాత ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు సమస్యపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రెండు వైపులా రోడ్డు కనెక్టివిటీ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రాజేందర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ రావు దృష్టికి తీసుకెళ్ళి వెంటనే పరిష్కరించేలా చొరవ చూపుతానని ఆయన తెలిపారు. నగునూర్ నుంచి రాణిపూర్ రోడ్డు వరకు దారి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ నాయకులు మూల రవీందర్ రెడ్డి, మూల ప్రభాకర్ రెడ్డి, స్థానిక నాయకులు భూమయ్య, చంద్రా రెడ్డి, మూల రాజిరెడ్డి, కాంతల రమణారెడ్డి, గోపాల రావు, కొలగాని అనిల్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలి

హుజూరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిరుపేదలకు మంజూరు చేయాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు తూర్పాటి రాజు అన్నారు. ఆదివారం పట్టణంలో బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాధనంతో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిరుపయోగంగా ఉండి, అసాంఘిక కార్యక్రలపాలకు అడ్డగా మారాయన్నారు. ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా వాటిని అధికారుల పర్యవేక్షణలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయాలన్నారు. సమా వేశంలో నాయకులు రావుల వేణు, నల్ల సుమన్, సబ్బని రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వెన్నంపల్లిలో హెల్త్ క్యాంప్

సైదాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నంపల్లిలో డెంగ్యూ పాజిటివ్ రావడంతో ఆదివారం వైద్యాధికారులు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే చేసి జ్వరపీడితులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశముందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దగ్గు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు నాయక్ హెల్త్ క్యాంపును సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్యసిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో తిరుగుతూ జ్వరసర్వే నిర్వహించాలని సూచించారు. వైద్యాధికారి శ్రవణ్ కుమార్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మందులు లేని పశువైద్యశాలలు ఎందుకు

గన్నేరువరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పశువులకు మందులు అందించలేని పశు వైద్య శాలలు ఎందుకు అని గొర్లు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్య దర్శి కాల్వ సురేష్ అన్నారు. మండలం లోని హన్మాజిపల్లిలో ఆదివారం గొర్లకాపరులకు గొర్లుమేకల పెంపకందార్ల సంఘం సభ్యత్వాన్ని ఇస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జంగపల్లిలో ఉప పశువైద్య శాల ఉండి లాభం లేదన్నారు. గొర్లకు వేసే మందులను బయట డబ్బులు వెచ్చించి కొను గోలు చేసి వైద్యం చేయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని, దీంతో గొర్ల కాపరులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, కార్య దర్శి మహేందర్, ఉపాధ్యక్షుడు భూసరాజు, నర్సయ్య, సంపత్, రాజయ్య పాల్గొన్నారు.

కాశ్మీర్ గడ్డ వాకర్స్ సంఘం కార్యవర్గం

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కాశ్మీర్ గడ్డ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిద్ధం వేణు, ప్రధాన కార్యదర్శిగా బాబా సలీం బేగ్, కోశాధికారిగా సయ్యద్ సైఫుద్దీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కాశ్మీర్‌గడ్డ వాకర్స్ సంఘం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గాన్ని మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, సంఘం సభ్యులు మధుసూదనాచారి, ఆది శ్రీనివాస్, జావీద్, నారాయణ, శంకర్, లక్ష్మీనారాయణ, రాజేందర్, రాము, విమల్, వంగపల్లి సూర్య ప్రకాశ్, విద్యాసాగర్, శ్రీనివాస్, నాగరాజు, ప్రకాష్ అభినందించారు.



సిద్ధం వేణు



బాబా సలీంబేగ్

జనహిత పాదయాత్ర సక్సెస్

(5వ పేజీ తరువాయి)

కుటుంబ సభ్యులతో కలిసి టీ తాగారు. బిల్లు పూర్తిగా వచ్చిందా.. అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. చాలా సంతోషంగా ఉందని అన్న భాగ్య తన సొంతింటి కళ ఇందిరమ్మ ఇంటితో నెరవేరిందని తెలిపారు.

● బీసీ సంఘాల మద్దతు

కాంగ్రెస్ జనహిత పాదయాత్రకు బీసీ సంఘాలు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 42 శాతం రిజర్వేషన్లతో బీసీలకు అండగా నిలుస్తున్న కాంగ్రెస్ పార్టీకి తమ మద్దతు ఉంటుందని వారు చెప్పారు.

ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం

జమ్మికుంట రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుబ్బ మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ సమేతంగా హాజరైన ఆర్యవైశ్యులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట,పాటలతో ఆహ్లాదంగా గడి పారు. ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు ఎలిమిల్ల రాజేంద్ర ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు నర్సన్న, ప్రధాన కార్యదర్శి బాదం సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) కరీంనగర్ శివారు బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 15 సుబ్రతో ఫుట్ బాల్ కప్ టోర్నమెంట్‌లో మొదటి స్థానాన్ని సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్‌లు సాయికిరన్, అనూష్ తెలిపారు. పాఠశాల వ్యాయామ విద్యాధిపతి మురళీ ధర్ మాట్లాడుతూ ఈనెల 25, 26న రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాఠశాల జట్టు తరపున పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బబితా విశ్వనాథన్, క్రీడారుల కృషని అభినందించారు. ఛైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

బీజేపీలో పలువురి చేరిక



కండువా కప్పుతున్న గంగాడి కృష్ణారెడ్డి

జమ్మికుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో పలువురు యువకులు బీజేపీలో చేరారు. కొత్తపల్లికి చెందిన అడిశెర్ల నాగరాజు, బోగ సురేష్, అవాంచ వెంకటేష్‌కు బీజేపీజిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. సారంగపాణి, గుగ్గిల సాగర్, పర్వత శివ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ ఆరోపణలు

గణేశ్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మాల్ ప్రాక్టీస్ (కాపీయింగ్) కు పాల్పడిన వారిని డీబార్ చేయగా విద్యార్థులు మరోసారి అవకాశం కల్పించాలని అధికారులతో ఆందోళనకు దిగినట్లు తెలిసింది. మరోవైపు వారికి అవకాశం ఇస్తే అందరికీ ఇవ్వాలని ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కోరినట్లు సమాచారం.

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించం

శాతవాహన యూనివర్సిటీలో నిర్వహిస్తున్న పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించబోమని యూనివర్సిటీ రిజిస్ట్రార్ రవికుమార్ జాస్తి తెలిపారు. కాపీయింగ్ పాల్పడినవారిపై వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

'కాలం ఒడిలో పుస్తకావిష్కరణ'



పుస్తకం ఆవిష్కరిస్తున్న సభ్యులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఉదయ సాహితీ ఆధ్వర్యంలో ఆదివారం వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో చిందం సునీత రచించిన కవితా సంపుటి 'కాలం ఒడిలో' పుస్తకాన్ని కరీంనగర్ గోదావరి బ్యాంకు మేనేజర్ అంకారపు కైలాసపతి ఆవిష్కరించారు. పుస్తకాన్ని దాస్యం సేనాధిపతి- గీతారాణి దంపతులకు అంకితమిచ్చారు. అన్నాడి గజేందర్‌రెడ్డి ఆడియో ద్వారా చేసిన పుస్తక పరిచయాన్ని వినిపించారు. ప్రొఫెసర్ రామకృష్ణ, ఎర్రం రాజారెడ్డి, చిందం రమేశ్, వైరాగ్యం ప్రభాకర్, రేళ్ల సంజీవ్, సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీదాస్యం లక్ష్మయ్య, స్వప్న కృష్ణ, కొమురోజు మాధవి, ఆది విజయలక్ష్మి, అన్నవరం దేవేందర్, బూర్ల వేంకటేశ్వర్లు, రాజు, తిరుపతి రెడ్డి, ఉషశ్రీ, సరసిజ, నిర్మలారాణి, సుజనాదేవి విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు 'తలపుల పుటలు' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు ఫిలింభవన్‌లో బూర్ల వెంకటేశ్వర్లు రచించిన కవితా సంపుటి 'తలపుల పుటలు' పుస్తకావిష్కరణ ఉంటుందని అధ్యక్ష, కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అన్నవరం దేవేందర్ ముఖ్య అతిథిగా, నగునూరి శేఖర్ పుస్తకావిష్కర్తగా, ఆచార్య కలువకుంట రామకృష్ణ, కొండి మల్లారెడ్డి, గాజోజు నాగభూషణం, కందుకూరి అంజయ్య, కూకట్ల తిరుపతి అతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

క్విజ్‌లో ట్రినిటి విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి బిర్లా సైన్స్ క్విజ్ పోటీల్లో నగరంలోని ట్రినిటి ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించారు. హైదరాబాద్‌లో ఈ నెల 23న నిర్వహించిన పోటీల్లో పాఠశాల విద్యార్థులు అబ్దుల్ గఫార్, హార్థిక్, నైనికరెడ్డి ప్రతిభ కబనరిచారు. విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రత్నమాల, ఉపాధ్యాయులు అభినందించారు.



బహుమతులు సాధించిన ట్రినిటి విద్యార్థులు

నేటి నుంచి మట్టి విగ్రహాల పంపిణీ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి నగరవాసులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను పూజించాలని పిలుపునిచ్చారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా నగరంలోని 66 డివిజన్లలో మట్టి వినాయకులను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వినాయకుల ప్రతిమల కోసం చర్యలు చేపట్టామని, సోమవారం నుంచి పంపిణీ చేపడతామని తెలిపారు.

ఇప్పటివరకు కొనని రైతులకు యూరియా

హుజూరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): యూరియాను ఇప్పటివరకు కొనుగోలు చేయని రైతులకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని హుజూరాబాద్ ఏడీఏ సునీత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే తగినంత యూరియాను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు అందజేస్తామని పేర్కొన్నారు. యూరియా కొనుగోలు చేసిన రైతులు మళ్లీ కొనుగోలు రావద్దని కోరారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

సుభాష్‌నగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): శ్రీసేవా మార్గ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు మునిపల్లి ఫణీత మాట్లాడుతూ పర్యావరణం కాలుష్యాన్ని నివారించడానికి తమవంతు సహకారంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశామన్నారు.

విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ

జమ్మికుంట రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచనపల్లిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అంత ర్జాతీయ చేతిరాత నిపుణుడు దిడ్డి సతీష్ సోమవారం చేతిరాతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పెన్ను పట్టుకునే పద్ధతి, అక్షరం సక్రమంగా రాసే విధానం ఎలా కూర్చోవాలి, అక్షరం ఒకే విధంగా ఎలా రాయాలి అనే అంశాలపై వివరించారు. విద్యార్థులు ప్రతి రోజు 20నిమిషాలు ప్రాక్టీస్ చేస్తే 21రోజుల్లో చక్కని చేతిరాత సొంతం అవుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు వేణుమాధవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా కోసం రాత్రి నుంచి నిరీక్షణ



యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

చిగురుమామిడి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుర్తిలో రైతులు శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు యూరియా కోసం పడిగాపులు కాశారు. చెప్పులు లైన్‌లో పెట్టి దాదాపు 500 మంది యూరియా కోసం వేచి చూశారు. చివరికి కేవలం 410 యూరియా బస్తాలు రావడంతో వాటిని పంపిణీ చేశారు. దాదాపు 300 మంది రైతులు నిరాశతో వెనుదిరిగారు. శనివారం రాత్రి నుంచి ఉన్నా తమకు యూ రియా రాలేదని మహిళా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు రోజుల్లో కొరత తీర్చాలి

- కాంతల శ్రీనివాస్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

రెండు, మూడు రోజుల్లో యూరియా కొరత లేకుండ చేస్తామని అధికారులు అంటున్నారు. ఒక వేళ యూరియా కొరతను తీర్చకపోతే మండలాన్ని దిగ్బంధిస్తాం. జిల్లా వ్యాప్తంగా రైతుల ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తాం. పాలకులు, అధికారులు దిగివచ్చేలా చేస్తాం. ఈ సమస్య ఇలానే ఉంటే పార్టీల నాయకులను గ్రామాల్లో తిరగనీయబోం.

రజకులు సంఘటిత ఉద్యమాలు చేయాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం రజకులు సంఘటిత ఉద్యమాలు చేయాలని తెలంగాణ రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రాచకొండ నరేశ్ అన్నారు. ఆదివారం నగరంలోని కెమిస్ట్ భవన్‌లో తెలంగాణ రజక సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాచకొండ నరేష్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న రజకులందరికి రుణాలు మంజూరు చేయాలని, ప్రభుత్వం ఫెడరేషన్‌కు కేటాయించిన రూ. 250 కోట్లు ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు లింకు లేకుండా షేర్ అమౌంట్ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. సొసైటీ రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ఆన్‌లైన్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తన నియామకానికి సహకరించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్, జిల్లా గౌరవాధ్యక్షుడు కొత్తకొండ రాజయ్య, దుబ్బాక రమేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కొత్తకొండ శ్రీనివాస్, రాచకొండ శ్రీనివాస్, వనపర్తి శంకర్, భూత్కూరి శివ, సట్ల భాల్‌రాజ్, అంజిబాబు, రాపాల శంకర్, కొల్లురి కుమార్, తిరుపతి, గుండేటి రాజు పాల్గొన్నారు.



నరేష్‌ను అభినందిస్తున్న సంఘం నాయకులు

ఘనంగా సికిందర్ భక్త్ జయంతి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

భగత్‌నగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో నగరలోని ఎంపీ కార్యాలయంలో బీజేపీ సీనియర్ నాయకుడు సికిందర్ భక్త్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ముజీబ్, జిల్లా అధ్యక్షుడు సమీపర్వేజ్, తాజుద్దీన్, సమ్యుల్లా అహ్మద్, షహజాద్, సాబీర్ ఫసి, సిద్దిక్ సైద్, అర్షద్, ఫైయ్యాజ్ చిస్తీ తదతరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ

మానకొండూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గయ్యపల్లిలో తాగునీటి పైపులైన్ లీకైంది. నీరంతా రోడ్డు పక్కన ప్రవహించడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు పేర్కొంటున్నారు. లీకేజీతో నీరంతా కలుషితమవుతోందంటున్నారు. అధికారులు స్పందించి లీకైన పైపునకు మరమ్మతు చేపట్టి స్వచ్ఛమైన నీటిని అందించాలని, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి

భగత్‌నగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డికి సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఆదివారం నివాళులు అర్పించారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం ముగ్దుం భవన్‌లో సుధాకర్‌రెడ్డి పార్థివదేహం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ దేశ రాజకీయాల్లో మహోన్నతమైన వ్యక్తి సుర వరం సుధాకర్‌రెడ్డి అన్నారు. పొనగంటి కేదారి, గూడెం లక్ష్మి, న్యాలపట్ల రాజు, బావండ్లపల్లి యుగంధర్, బూడిద సదాశివ, గొడిసెల తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి : సురవరం సుధాకర్‌రెడ్డి అకాల మరణం కమ్యూనిస్టు పార్టీకి, పేద సామాజిక వర్గానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందె స్వామి, మండల కార్య దర్శి నాగెల్లి లక్ష్మరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఇందుర్తి గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యవర్గ సభ్యుడు అందె చిన్నస్వామి, తిరుపతి, ఉస్మాన్‌పాషా, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కాంతల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి జయపాల్‌రెడ్డి, కూన భాస్కర్, అందె వెంకన్న, చారి, రాజయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు